సాక్షి
మహబూబాబాద్
శనివారం । 10 । జూన్ । 2023



రహదారులు రక్తసిక్తం

ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఏడుగురు మృతి చెందారు.

- 8లో ▸



ఆర్టీసీకి సంపూర్ణ సహకారం

టీఎస్ ఆర్టీసీకి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని రవాణా శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం తెలిపారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
42.0°/26.0°

జిల్లాలో ఉదయం నుంచి వేడి వాతావరణం ఉంటుంది. మధ్యాహ్నం వడగాలులు ఎక్కువగా వీస్తాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

విధుల్లో చేరిన ముగ్గురు డాక్టర్లు



సాక్షి స్పందన

గార్ల: మానుకోట జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకట్రాములు ఆదేశాల మేరకు గార్ల సీహెచ్‌సీలో ముగ్గురు స్పెషలిస్ట్ వైద్యులు విధుల్లో చేరారు. 'వేధిస్తున్న వైద్యుల కొరత' శీర్షికన శుక్రవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి స్పందించి వైద్యులను నియమించారు. జనరల్ సర్జన్ వినీల్‌రెడ్డి, డెర్మటాలజిస్ట్ అర్జున్, చెస్ట్ స్పెషలిస్ట్ డాక్టర్ సతీష్ విధుల్లో చేరినట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రాజేష్ తెలిపారు. ఇక నుంచి ఆస్పత్రిలో ఆరుగురు డాక్టర్లు ప్రజలకు అందుబాటులో ఉంటారని ఆయన పేర్కొన్నారు.

నూతన పీఆర్సీ అమలు చేయాలి



తొర్రూరు: నూతన పీఆర్సీ అమలు కోసం ఉపాధ్యాయుల తరఫున ఉద్యమిస్తామని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు సుధాకరాచారి అన్నారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో ఎస్టీయూ 76వ ఆవిర్భావ వేడుకలు నిర్వహించారు. సుధాకరాచారి మాట్లాడుతూ.. కొత్త పీఆర్సీ గడువు ఈ నెలతో ముగియనుందని, జూలై 1నుంచి నూతన పీఆర్సీ అమలు చేయాల్సి ఉందన్నారు. దానికోసం కమిటీ ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. 317 జీఓతో తలెత్తిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. గ్రేడ్-2 పండితులు, పీఈటీల పదోన్నతుల న్యాయపరమైన చిక్కులను తొలగించాలన్నారు. ఎస్టీయూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి అలుపెరుగని పోరు చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాకూబ్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు చంద్రప్రకాష్, అసోసియేట్ అధ్యక్షుడు యాకయ్య, నాయకులు చంద్రమౌళి, రమేష్, హరికృష్ణాచారి, శ్రీనివాస్, ప్రభాకర్ పాల్గొన్నారు.

విభజన హామీల అమలుకు పోరాడుదాం



నెహ్రూసెంటర్: విభజన హామీల అమలుకోసం పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయసారథి మాట్లాడుతూ.. విద్యా, వైద్యం, ఉపాధి, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ప్రజాసమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11న కొత్తగూడెంలో నిర్వహించనున్న ప్రజాగర్జన సభకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ ముఖ్య భూమిక పోషిస్తుందని, ప్రతి నియోజకవర్గంలో పార్టీ బలమైన ఓటు బ్యాంకు కలిగి ఉందన్నారు. సమావేశంలో సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, వెలుగు శ్రావణ్ పాల్గొన్నారు.

2కే రన్‌ను విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో ఈ నెల 12న ఉదయం 6గంటలకు జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో నిర్వహించే 2కే రన్‌ను విజయవంతం చేయాలని డీఈఓ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో, మరిపెడ మండంలోని కార్గిల్ సెంటర్‌లో 2కే రన్ నిర్వహిస్తామన్నారు. మండలాల నుంచి విద్యార్థులు, పీఈటీలు, పీఈడీలు హాజరై విజయవంతం చేయాలన్నారు.

తహసీల్దార్ సస్పెన్షన్

గార్ల: జిల్లాలోని గార్ల తహసీల్దార్ రామును కలెక్టర్ శశాంక సస్పెండ్ చేసినట్లు శుక్రవారం రాత్రి ఆలస్యంగా వెలుగుచూసింది. గార్ల జీపీ పరిధి పూమ్యాతండాలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు ఎకరం భూమిని తహసీల్దార్ గుర్తించారు. అయితే ఆ భూమి ఎంక్రోచ్‌లో ఉండగా పేదలకు స్థలాలు ఇచ్చి, పట్టాలు ఎలా పంపిణీ చేస్తావని తహసీల్దార్‌పై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేసి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. కాగా గార్ల డీటీగా పనిచేస్తున్న వీరన్నను ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించినట్లు సమాచారం.

మన బడి.. తడబడి

నత్తనడకన 'మన ఊరు-మనబడి' పనులు

- జిల్లాలో మొదటి విడతలో 315 పాఠశాలల ఎంపిక
- 35 బడుల్లో మాత్రమే పనులు పూర్తి
- చాలా స్కూళ్లల్లో ప్రారంభం కాని వైనం
- 12న పాఠశాలల పునఃప్రారంభం

సాక్షి పరిశీలన

జిల్లాలో 'మన ఊరు-మన బడి' అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో 315 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో ఇప్పటి వరకు 35 పాఠశాలల్లో మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఇంకా 280పాఠశాలల్లో పనులు చేపట్టాల్సి ఉంది. కాగా చాలా స్కూళ్లల్లో ఇప్పటి వరకు అభివృద్ధి పనులు ప్రారంభం కాలేదు. ఈ నెల 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో శుక్రవారం 'సాక్షి' చేపట్టిన పరిశీలనలో పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి.

– మహబూబాబాద్ అర్బన్



ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల



పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పాఠశాల

అద్దె చెల్లిస్తూ చదువు చెప్పలేం..



నిర్మాణ పనులు పూర్తి కాని తెల్లబండతండా పాఠశాల భవనం

డోర్నకల్: మండలంలోని తెల్లబండతండాలోని ఎంపీపీఎస్ పాఠశాల భవనాన్ని కూల్చివేసి మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా నూతన భవన నిర్మాణం ప్రారంభించారు. ఈ క్రమంలో అద్దె భవనంలో పాఠశాల నిర్వహణ చేపట్టారు. ప్రస్తుతం పాఠశాల భవన నిర్మాణ పనులు 70శాతం పూర్తయ్యాయి. ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, కిచెన్‌షెడ్, టాయిలెట్లు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులు పూర్తి కాలేదు. పనులు పూర్తి కావడానికి మరో నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. మూడు రోజుల్లో పాఠశాల పునఃప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో అద్దె భవనంలో అద్దె చెల్లిస్తూ పాఠాలు బోధించలేమని, అసంపూర్తి నూతన భవనంలోనే తరగతులు నిర్వహిస్తామని ప్రధానోపాధ్యాయుడు వీరస్వామి తెలిపారు. సమీపంలోని ఓ ఇంట్లోని టాయిలెట్‌ను వినియోగిస్తామని, తాగునీటి కోసం వాటర్ క్యాన్లను కొనుగోలు చేస్తామని హెచ్‌ఎం చెప్పారు.

మళ్లీ చెట్ల కింద చదువులే..

కొత్తగూడ: మండలంలోని వేలుబెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చేపట్టిన మన ఊరు- మన బడి అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోంది. పాఠశాలలో 108 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఒకే తరగతి గది ఉంది. అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం సుమారు రూ.36లక్షల నిధులు మంజూరు చేసి టెండర్లు నిర్వహించారు. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ మార్చి 23న పనులు ప్రారంభించినా.. ఇప్పటి వరకు పిల్లర్లకే పరిమితమయ్యాయి. పనుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. పాఠశాల ప్రారంభమైతే మళ్లీ చెట్ల కిందే చదువుకోవాలా అని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని పనులు వేగవంతం చేయాలని కోరుతున్నారు.



స్లాబ్ కూడా వేయని పాఠశాల తరగతి గదులు



మార్చి 23న పనులు ప్రారంభించిన సర్పంచ్

కూల్చివేశారు.. నిర్మాణం మరిచారు

మహబూబాబాద్ రూరల్: మానుకోట మండలంలోని ముడుపుగల్ జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల ఆవరణలో మన ఊరు- మన బడి అభివృద్ధి పనులు ప్రారంభించారు. అయితే కూల్చివేతలు చేపట్టి, నిర్మాణాలు మర్చిపోయారు. దీంతో రెండు పాఠశాలల్లో చదువుతున్న 230మంది విద్యార్థులకు ఇబ్బందులు తప్పేలా లేవు. అభివృద్ధి పనుల్లో భాగంగా కిచెన్‌షెడ్, డైనింగ్‌హాల్, బాలికల టాయిలెట్ల నిర్మాణం కోసం పాఠశాల ఆవరణలోని పాత గదులను కూల్చివేసి పనులు చేపట్టి 8 నెలలు గడిచినా ముందుకు సాగడం లేదు. అలాగే ప్రహరీని సైతం కూల్చివేయడంతో పశువులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. అలాగే తాగునీటి సంపు నిర్మాణం చేపట్టగా.. దానిపై రెండు మూతలు పెట్టడం కోసం రంధ్రాలు చేసి అలాగేవదిలేశారు.



పాఠశాల ఆవరణలో మూతలు లేని సంపు నిర్మాణం

ఆ సంపు లోపలిభాగంలో పనులు పూర్తిస్థాయిలో జరగకపోవడంతో పాటు నీటి సరఫరా కోసం కనెక్షన్ ఇవ్వలేదని స్థానికులు తెలిపారు. ఎంపీపీఎస్ ఆవరణలో నిర్మించిన బాలికల టాయిలెట్లలో నీళ్లు బయటకు వెళ్లే పరిస్థితి లేదు. దీంతో విద్యార్థినులు ఆరుబయటకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులను నిలిపివేసినట్లు స్థానికులు తెలిపారు.



ముడుపుగల్ పాఠశాల ఆవరణలో ప్రారంభించని పనులు



మానుకోట ప్రభుత్వ బాలుర పాఠశాలలో కొనసాగుతున్న పనులు

జిల్లాలో మన ఊరు- మన బడి పనుల వివరాలు	
ఎంపికైన పాఠశాలలు	315
పనులు పూర్తయిన స్కూళ్లు	35
అసంపూర్తి, పనులు ప్రారంభకాని బడులు	280

బడి మూత.. పిల్లలు పక్క తండాకు..



భూక్యతండాలో శిథిలావస్థకు చేరి మూతపడిన పాఠశాల భవనం

మరిపెడ రూరల్: మండలంలోని భూక్యతండాలోని ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోగా మన ఊరు-మన బడి కార్యక్రమంలో ఎంపిక చేశారు. మరమ్మతుల కోసం రూ.3.80లక్షలు మంజూరు చేశారు. అయితే శిథిలావస్థలో ఉన్న భవనం కూల్చివేసి కొత్త భవనం నిర్మించాలని సర్పంచ్ భూక్య సేవ్యానాయక్ గ్రామ పంచాయతీలో తీర్మానం చేసి జిల్లా స్థాయి అధికారులకు విన్నవించారు. కాగా అధికారులు పట్టించుకోలేదు. దీంతో శిథిలావస్థకు చేరిన పాఠశాల అభివృద్ధికి నోచుకోక మూతపడ్డది. పాఠశాల ఉపాధ్యాయుడితో పాటు 15మంది విద్యార్థులను కిలోమీటరు దూరంలో ఉన్న మాలోత్‌తండా పాఠశాలకు షిఫ్ట్ చేశారు. పిల్లలు కాలినడకన పాఠశాలకు వెళ్లిరావాల్సి వస్తోంది. దీంతో పిల్లల తల్లిదండ్రులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరిన భవనం స్థానంలో నూతన భవనం నిర్మించి విద్యార్థులకు పాఠాలు బోధించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



తొర్రూరులో మాట్లాడుతున్న మంత్రి దయాకర్‌రావు

తొర్రూరు: సీఎం కేసీఆర్ పాలన సంక్షేమానికి స్వర్ణయుగం అని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం డివిజన్ కేంద్రంలోని ఎల్‌వైఆర్ గార్డెన్‌లో సంక్షేమ సంబరాలు నిర్వహించారు. దీనిలో భాగంగా తొర్రూరు, పెద్దవంగర మండలాల లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, గొర్రెలు, వివిధ వృత్తిదారులకు ఆర్థికసాయం కలెక్టర్ శశాంకతో కలిసి మంత్రి దయాకర్‌రావు అందజేశారు. జర్నలిస్టులకు డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలు అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సంపద పెంచి పేదలకు పంచారని, పెద్ద కొడుకులా వృద్ధులకు పింఛన్లు అందిస్తున్నారన్నారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింట్లో వెలుగులు నింపారన్నారు. తొమ్మిదేండ్లలో ఆసరా పింఛన్ల కింద రూ.59 వేల కోట్లు అందించామని గుర్తు చేశారు. కాంగ్రెస్ పాలనలో రెండు, మూడు రోజులకు ఒకసారి మంచి నీళ్లు వచ్చేవని, ఇప్పుడు మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ సురక్షిత మంచి నీరు అందిస్తున్నామని తెలిపారు. గొర్రెల పంపిణీ పథకం ద్వారా రాష్ట్రంలో మాంసం ఉత్పత్తి గతంలో పోల్చితే 22 శాతం పెరిగిందన్నారు. చేపల ఉత్పత్తిలోనూ దూసుకుపోతున్నదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మంగళపల్లి రామచంద్రయ్య, తొర్రూరు, పెద్దవంగర ఎంపీపీలు తూర్పాటి చిన్న అంజయ్య, ఈదురు రాజేశ్వరి, జెడ్పీటీసీలు మంగళపల్లి శ్రీనివాస్, జ్యోతిర్మయి, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పరీక్షకు పటిష్టమైన భద్రత

మహబూబాబాద్ రూరల్: జిల్లాలో ఈ నెల 11న జరిగే గ్రూప్-1పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాటు చేస్తున్నట్లు మహబూబాబాద్ ఇన్‌చార్జ్ డీఎస్పీ రమణబాబు శుక్రవారం తెలిపారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 100 మీటర్ల వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల పాటించాల్సిన నిబంధనల గురించి ఆయన వివరించారు. అభ్యర్థులు బ్లూ, బ్లాక్ బాల్ పాయింట్ పెన్నులను మాత్రమే తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వ గుర్తింపు కార్డు తెచ్చుకోవాలన్నారు. పరీక్ష సమయం ముగిసిన తర్వాతనే హాల్ నుంచి బయటకు వెళ్లాలన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారంపై దృష్టి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

డోర్నకల్: గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు దృష్టి సారించాలని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో తాగునీటి సమస్యపై శుక్రవారం ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. గురువారం మండలంలోని బోడహట్యాతండాలో పర్యటించిన సమయంలో స్థానికులు తాగునీటి సమస్యపై ఎమ్మెల్యే ఎదుట నిరసన తెలిపిన నేపథ్యంలో సమస్య పరిష్కారం కోసం సీడీఎఫ్ నిధుల నుంచి రూ.5లక్షల కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. బోడహట్యాతండాలో వెంటనే తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు స్థానికంగా ఉంటూ తాగునీటి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ దరంసోత్ బాలునాయక్, ఎంపీడీఓ అపర్ణ, తహసీల్దార్‌రు స్వాతిబిందు, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కత్తెరసాల విద్యాసాగర్, పీఏసీఎస్ చైర్మన్ చేరెడ్డి బిక్షంరెడ్డి, ఇంట్రా డీఈ శ్రీనివాసరావు, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నున్నా రమణ, నాయకులు రామనాథం, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం



రవీందర్‌ను సత్కరిస్తున్న ముదిరాజ్ మహాసభ నాయకులు

తొర్రూరు: మత్స్యకారులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ పిట్టల రవీందర్ అన్నారు. డివిజన్ కేంద్రానికి వచ్చిన రవీందర్‌ను శుక్రవారం ముదిరాజ్ మహాసభ మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. వంద శాతం సబ్సిడీతో చేప విత్తనాలు, వాహనాలు అందించి మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకుందన్నారు. మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం కొత్త పథకాలను రూపొందించిందన్నారు. 4,730 మత్స్య సహకార సంఘాల్లోని 4.60లక్షల మంది మత్స్యకారులకు లబ్ధి చేకూరే విధంగా ఫిషరీస్ ఫెడరేషన్ ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తుందన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నాయకులు పల్లెబోయిన అశోక్, చిల్లా సహదేవ్, గట్టయ్య, పిట్టల ధనుంజయ్, కొత్తూరు రమేష్, పంజా వెంకన్న పాల్గొన్నారు.

ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేయాలి



వీబీఓలకు కిట్లను అందజేస్తున్న అధికారులు

నెహ్రూసెంటర్: ఆర్టీసీ అభివృద్ధికి విలేజ్ బస్ ఆఫీసర్లు(వీబీఓ) కృషి చేయాలని జిల్లా రవాణాశాఖ అధికారి రమేష్‌రాథోడ్, పట్టణ సీఐ వై.సతీష్ అన్నారు. మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం విలేజ్ బస్ ఆఫీసర్ల ప్రారంభ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్టీసీ ప్రజలకు మరింత చేరువయ్యేలా సిబ్బంది, ఉద్యోగులు తమవంతు ప్రయత్నించాలన్నారు. పల్లెలు, పట్టణాల్లో ఆర్టీసీ సేవలపై అవగాహన కల్పించి సంస్థను బలోపేతం చేయాలన్నారు. ఆర్టీసీ డీఎం విజయ్ మాట్లాడుతూ.. మానుకోట డిపో పరిధిలో 13 మంది వీబీఓలు ఎంపికయ్యారని, ఇకపై వారి గ్రామాలు, పట్టణ పరిధిలో ఆర్టీసీ సేవలపై ప్రచారం, అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆర్టీసీ నుంచి వచ్చిన కిట్లను వీబీఓలకు అందజేశారు.

గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై అవగాహన అవసరం

- కలెక్టర్ శశాంక
- కలెక్టరేట్‌లో మండల స్థాయి అధికారులకు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఈ నెల 11న జరిగే గ్రూప్-1 పరీక్ష నిర్వహణపై పూర్తిస్థాయిలో అవగాహన పొందాలని కలెక్టర్ శశాంక అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం గ్రూప్-1పరీక్ష నిర్వహణపై సంబంధిత అధికారులు, అదనపు కలెక్టర్ డేవిడ్ ఆధ్వర్యంలో మండలస్థాయి అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గ్రూప్-1 పరీక్ష నిర్వహణకు 13సెంటర్లు ఏర్పాటు చేశామని చెప్పారు. 4,046మంది పరీక్షకు హాజరవుతారని చెప్పారు. ఉదయం 10:30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉదయం 8:30గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, ఉదయం 10:15గంటల వరకే హాల్‌లోకి అనుమతి ఇస్తామన్నారు. ఆర్టీసీ అధికారులు సకాలంలో బస్సులు నడిపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభ్యర్థులు బూట్లతో పరీక్షకు హాజరు కావొద్దని, ఆధునిక సాంకేతిక పరికరాలు పరీక్ష కేంద్రంలోకి తీసుకురావద్దన్నారు. సెల్‌ఫోన్లకు అనుమతి లేదన్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలు, వాష్ రూమ్‌లను క్షుణంగా తనిఖీ చేయాలని, తాగునీటి సౌకర్యం, వైద్యశిబిరం, విద్యుత్ సరఫరా తప్పనిసరిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో అధికారులు నర్మద, పి.రామారావు, మున్సిపల్ కమిషనర్లు, మండలస్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..

మానుకోటలోని సోషల్ వెల్ఫేర్ గురుకులం, ఎంజేపీ, అనంతారం మోడల్ స్కూల్, మానుకోట ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, మహర్షి డిగ్రీ కళాశాల, మరిపెడలోని బాలుర గురుకుల పాఠశాల, గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల, తొర్రూరులోని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్ జూనియర్ కళాశాల, సమత డిగ్రీ కళాశాల, మానుకోటలోని తక్షశిల హైస్కూల్, ఏకశిల హోలిఏంజిల్ హైస్కూల్, తొర్రూరు మండలం వెలికట్టెలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.

బడిబాట ర్యాలీ



బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు

బయ్యారం: బడిబాట కార్యక్రమంలో భాగంగా బయ్యారం జగ్గుతండాలో శుక్రవారం జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పూల్‌చంద్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించాలని, అనుభవం కలిగి ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య బోధిస్తున్నామని, విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు విజయలక్ష్మి, లింగరాజు, రంగన్న, ఉపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి, ధనుంజయ్, రవీందర్, కౌసల్య, దస్తగిరి, లక్ష్మీనారాయణ, అరుణ్, గాయత్రి, రూప్ల, రాంజీ, మంగీలాల్, లింగ్యా తదితరులు పాల్గొన్నారు.

108అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



మహబూబాబాద్ రూరల్: పురిటి నొప్పులతో బాధపడుతూ ఓ మహిళ 108వాహనంలో ప్రసవించిన ఘటన మానుకోట మండలం ఆమనగల్ గ్రామ శివారులో శుక్రవారం జరిగింది. 108 అంబులెన్స్ ఈఎంటీ ఎస్.చంద్య, పైలట్ నెహ్రూ వివరాలు వెల్లడించారు. నెల్లికుదురు మండలంలోని మదనతుర్తి గ్రామానికి చెందిన వడ్లకొండ కరుణ పురిటి నొప్పులతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు 108కి సమాచారం ఇచ్చారు. వాహనంలో ఆమెను తీసుకెళ్తుండగా నొప్పులు మరింత ఎక్కువ కావడంతో ఆమనగల్ గ్రామ శివారులో ఆమెకు సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. ఇద్దరిని మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

● పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్


షాపు యజమాని అరెస్టును చూపిస్తున్న టాస్క్‌ఫోర్స్, ఇంతేజార్‌గంజ్ పోలీసులు

వరంగల్ క్రైం: దుకాణదారులు విత్తనాల కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. సీపీ ఆదేశాల మేరకు వరంగల్ స్టేషన్ రోడ్డులోని ఫర్టిలైజర్ షాపుల్లో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్‌రెడ్డి నేతృత్వం లోని పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. ఏం ఎస్ మల్లికార్జున్ దుకాణంలో సదానందర్ బీజీ–2 పత్తి విత్తనాలను ఎక్కువ ధరకు అమ్ముతున్నట్లు వెల్లడైంది. ఒక ప్యాకెట్ అసలు ధర రూ.853 కాగా.. రెండు ప్యాకెట్లను రూ.2100 అమ్ముతున్నారు. విత్తనాలు, పురుగు మందులను ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు. కాగా, మరో రకం పత్తివిత్తన ప్యాకెట్ అసలు ధర రూ.853 ఉండగా రెండు ప్యాకెట్లను రూ.2100కి అమ్ముతున్నారు. విత్తనాలను స్వాధీనం చేసుకుని, షాపు యజమాని అక్కల మల్లికార్జున్‌ను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే విత్తనాలను అమ్మాలని సీపీ సూచించారు.

ముగ్గురికి గ్రేడ్–3 కార్యదర్శులుగా పదోన్నతి

వరంగల్: ముగ్గురు అసిస్టెంట్ సెక్రటరీలకు గ్రేడ్–3 కార్యదర్శులుగా పదోన్నతి కల్పించి, బదిలీ చేస్తూ రాష్ట్ర మార్కెటింగ్ డైరెక్టర్ జి. లక్ష్మీబాయి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో అసిస్టెంట్ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తున్న జె. భాస్కర్‌కు గ్రేడ్–3 పదోన్నతి కల్పించి జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మార్కెట్‌కు బదిలీ చేశారు. ఎ. షరీఫ్‌కు గ్రేడ్–3గా ఇక్కడి నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మార్కెట్‌కు బదిలీ చేశారు. ఇక్కడే పనిచేస్తున్న ఎస్.శ్రీనివాస్‌కు గ్రేడ్–3గా పదోన్నతి కల్పించి జనగామ మార్కెట్ కమిటీకి బదిలీ చేశారు.

మణుగూరు టు బెల్లాపి ప్రత్యేక రైలు పునఃప్రారంభం

కాజీపేట: మూడో రైల్వేలైన్ పనులతో ఇటీవల నిలిపివేసిన మణుగూరు బెల్లాపి ప్రత్యేక రైలు ఆదివారం సికింద్రాబాద్ నుంచి మణుగూరుకు పునఃప్రారంభిస్తున్నట్లు రైల్వే అధికారులు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రైలు(07335) 11న ఉదయం 5.25కు సికింద్రాబాద్‌లో ప్రారంభమై భువనగిరి, జనగామ, కాజీపేట, వరంగల్‌కు 7.58 గంటలకు చేరుకుని కేసముద్రం, మహబూబాబాద్, డోర్నకల్, గాంధీపురం, భద్రాచలం రోడ్డు స్టేషన్లలో ఆగుతూ 12.50 గంటలకు మణుగూరుకు చేరుకుంటుంది. 12న 07336 రైలు మణుగూరులో 3.40 గంటలకు ప్రారంభమై స్టేషన్లలో ఆగుతూ వరంగల్‌కు 7.28, సికింద్రాబాద్‌కు 10.10 గంటలకు చేరుకుంటుందని రైల్వే అధికారులు పేర్కొన్నారు.



తల్లిని చూడడానికి వస్తూ అనంతలోకాలకు..

● ఆగి ఉన్న లారీ కిందికి దూసుకెళ్లిన బైక్..
● అక్కడికక్కడే అన్నాచెల్లెలు మృతి


లారీకింద ఇరుక్కుపోయిన సుజితరెడ్డి,పూజితారెడ్డి


హసన్‌పర్తి : రెండు రోజులు సెలవులు ఉండడంతో తల్లిని చూడడానికి స్వగ్రామానికి వస్తున్న అన్నాచెల్లెలు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన పోరెడ్డి సుజాత– దేవేందర్‌రెడ్డి దంపతులకు కుమారుడు సుజిత్‌రెడ్డి (27), పూజితారెడ్డి(24) ఉన్నారు. పూజితారెడ్డి హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తుండగా, సుజిత్ ప్రైవేట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. శని, ఆదివారాల్లో సెలవులు ఉండడంతో తల్లిని చూడడానికి బైక్‌పై నాగారం వస్తున్నారు.ఈ క్రమంలో బైక్.. ధర్మసాగర్ మండలం కరుణాపురం వద్ద ప్రధాన రహదారిపై నిలిచి ఉన్న లారీ కిందికి దూసుకెళ్లింది. దీంతో వారు అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు.

అనాథ అయిన తల్లి..

కాగా, కొడుకు, కూతురు మృతి చెందడం, అంతకుముందే భర్తను కోల్పోవడంతో ప్రస్తుతం ఆ తల్లి అనాథ అయింది. కష్టాలు ఎదురైనా ఎన్నో కష్టాలు పడిన తల్లికి మరిన్ని కష్టాలు తోడయ్యాయి. కొడుకు, కూతురు మృతదేహాలపై ఆ తల్లి పడి ఏడుస్తుండగా, అక్కడి ప్రతి ఒక్కరూ కన్నీటి పర్యంతమయ్యారు.

రహదారులు రక్తసిక్తం..

రహదారులు రక్తసిక్తమయ్యాయి.. శుక్రవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేర్వేరుచోట్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో 7 గురు మృతి చెందారు. ధర్మసాగర్ మండలం కరుణాపురం వద్ద బైక్.. లారీ కిందికి దూసుకెళ్లిన ఘటనలో అన్నాచెల్లెలు, మరిపెడ మండలం కోమటికుంట తండా సమీపంలో లారీని బైక్ ఢీకొనడంతో నవదంపతులు, మహాముత్తారం మండలం కొర్లకుంట గ్రామంలో బైక్.. ట్రాలీ ఆటోను ఢీకొనడంతో బైక్‌పై ఉన్న వ్యక్తితోపాటు ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే, పర్వతగిరి మండలం వడ్లకొండ వద్ద బైక్.. మట్టిదిబ్బను ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలతో ఆయా కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.



ట్రాలీ ఆటో, బైక్ ఢీ..

● ఇద్దరు మృత్యువాత


సమ్మక్క, అశోక్ మృతదేహాలు

మహాముత్తారం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని కొర్లకుంటలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన చేరాలు అశోక్ ద్విచక్ర వాహనంపై మహాముత్తారం నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో గ్రామశివారులోని అలుగు వాగు సమీపంలో గోదావరిఖని నుంచి మంగపేటకు వెళ్తున్న ట్రాలీ ఆటోను ఎదురుగా ఢీకొన్నాడు. దీంతో ట్రాలీ ఆటోలో ముందు భాగం లో కూర్చున్న చిల్ల సమ్మక్కతో పాటు అశోక్ అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలుసుకున్న కాటారం సీఐ రంజిత్‌రావు ఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు చిల్ల పోశాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

పెళ్లయిన మూడు నెలలకే కబళించిన మృత్యువు..

● బైక్, లారీ ఢీ
● దంపతులు మృతి


నారాయణ సింగ్,అంజలి మృతదేహాలు

మరిపెడ రూరల్ : లారీ, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో నవ దంపతులు అక్కడి అక్కడే మృతి చెందారు. కాగా, పెళ్లయిన మూడు నెలలకే దంపతులను లారీ రూపంలో మృత్యువు కబళించింది. దీంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. మరిపెడ మండల కేంద్రం పులిజాలర్‌కు చెందిన అంజలి (21)కి జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం చెల్లగొనిగు చెందిన ఉగనోర్ నారాయణసింగ్ (23)కు గత మార్చి 9న వివాహం జరిగింది. నారాయణ సింగ్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో వీకెండ్ కావడంతో దంపతులు బైక్‌పై అత్తగారింటికి వస్తుండగా మరిపెడ మండలం కోమటికుంట తండా సమీపంలో ఎదురుగా హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని బైక్ ఢీకొంది. ఈ ఘటనలో దంపతులు అక్కడి అక్కడే మృతి చెందారు.

మట్టిదిబ్బను ఢీకొని..


రాజు మృతదేహం

పర్వతగిరి : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని వడ్లకొండ, ఉప్పరపల్లి గ్రామాల మధ్యలో జరిగింది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం వడ్లకొండకు చెందిన తాటికాయల రాజు కుటుంబ సభ్యులతో కలిసి అనంతారంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. గురువారం రాత్రి పని నిమిత్తం వడ్లకొండకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. అనంతరం రాజు ఎంతకూ ఇంటికి రాలేదు. దీంతో అతని తమ్ముడు నవీన్, కొడుకు రవితేజ.. రాజు ఆచూకీ కోసం బయలుదేరారు. ఈ క్రమంలో వడ్లకొండ, ఉప్పరపల్లికి దారిలో రోడ్డు పక్కన ఉన్న మట్టి దిబ్బను గుర్తుకుని కిందపడి ఉన్నాడు. గమనించిన వారు వెంటనే 108కు సమాచారం ఇవ్వగా అప్పటికే రాజు మృతి చెందాడు. దీనిపై మృతుడి భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



'ఆ బాలిక ఖరీదు రూ.13 లక్షలు'పై ఎఫ్ఐఆర్

● మధ్యవర్తిత్వం చేసిన 12 మందిపై కేసు నమోదు



సాక్షి, వరంగల్: 'ఆ బాలిక ఖరీదు రూ.13 లక్షలు' శీర్షిక సాక్షి ప్రధాన సంచికలో ఈ నెల 6వ తేదీన ప్రచురితమైన కథనాన్ని తీవ్రంగా పరిగణించిన వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ మేరకు చర్యలు తీసుకున్నారు. పోక్సో కేసు నీరుగార్చేలా మధ్యవర్తిత్వం చేసిన 12 మంది పెద్దలపై 195 (ఎ) సెక్షన్ 34 ఐపీసీ సెక్షన్ కింద కేసు నమోదు చేశారు. ఓ బాలికను నర్సంపేటకు చెందిన యువకుడు ప్రేమపేరుతో మోసం చేయడంతో ఆతనిపై 2022 ఆగస్టు 14న నమోదైన పోక్సో కేసు కోర్టులో కొట్టుడుపోయే విధంగా సహకరించారంటూ పెద్దలు ఒత్తిడి తీసుకురావడంతో ఇష్టం లేని బాధితురాలు సీపీ రంగనాథ్‌ను గత గురువారం మరోమారు కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేసింది. అప్పటికే సాక్షిలో వచ్చిన కథనంతో మధ్యవర్తుల వివరాలు సేకరించిన ప్రత్యేక ఎస్బీ బృందం సీపీ కార్యాలయానికి తీసుకొచ్చి మరీ విచారించారు. ఈశ్వర్ సింగ్, అనిల్, మందకుమార్, జైపాల్‌రెడ్డి, నల్ల మనోహర్‌రెడ్డి, చందన, నిరంజన్‌రెడ్డి, నూరయ్య, దల్లామల్లారెడ్డి, శారద, కొమ్మాలు, లక్ష్మీపతిపై నర్సంపేట టౌన్ పీఎస్‌లో కేసు నమోదు చేశారు. ఇందులో పోలీసుల ప్రమేయం ఉందా, ఉంటే ఎవరూ ఉన్నారనే దిశగానూ ఎస్బీ బృందాలు ఇప్పటికే విచారణ ముమ్మరం చేసినట్లు తెలిసింది.

నర్సంపేట ఏసీపీ ఆఫీసు ఎదురుగానే పంచాయితీ

నర్సంపేట పట్టణానికి చెందిన ఓ యువకుడు.. ఓ తండాకు చెందిన 16 ఏళ్ల బాలికను ప్రేమిస్తున్నానని నమ్మించాడు. ఆ తర్వాత మోహం చాటేయడంతో మోసపోయానని తెలుసుకున్న సదరు బాలిక ఇచ్చిన ఫిర్యాదుతో యువకుడిపై పోక్సో కేసు నమోదైంది. ఈ వివాదాన్ని పెద్దల ముందు తేల్చుకోవాలని పరిహారం ఇవ్వాలని నర్సంపేట ఏసీపీ ఆఫీసుకు ఎదురుగా ఉన్న ఎంపీడీఓ ఆఫీసులో జరిగిన పంచాయితీలో నిర్ణయించి రూ.13లక్షలకు తీర్మానం చేశారు. రూ.ఐదు లక్షలు తల్లి కారణం ఇచ్చి ఆదే నగదును నర్సంపేటలోని డీసీసీ బ్యాంక్ బ్రాంచ్‌లో చందన, మల్లారెడ్డి పేర్ల మీద ఉన్న జాయింట్ అకౌంట్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఫిర్యాదురాలు డబ్బు తీసుకునేందుకు సుముఖంగా లేకపోవడంతో కోర్టు ద్వారా తనకు న్యాయం జరుగుతుందని భావించిన బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.



తెలంగాణ అభివృద్ధే కేసీఆర్ లక్ష్యం..



మాట్లాడుతున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి: తెలంగాణను అన్ని రంగాల్లో సమగ్రంగా అభివృద్ధి చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా శుక్రవారం మండలంలోని కిష్టాపురం క్రాస్‌లోని వీకెగార్డెన్‌లో నిర్వహించిన తెలంగాణ సంక్షేమ సంబురాల్లో మంత్రి పాల్గొని మాట్లాడారు. 'ప్రతీ ఇంట్లో సంక్షేమం.. ప్రతీ ముఖంలో సంతోషం' అనే కోణంలో సీఎం కేసీఆర్ పని చేస్తున్నట్లు చెప్పారు. రూ. 60వేల కోట్లతో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. రూ. 55వేల కోట్లకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్లలోనే తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలిచాయన్నారు. అనంతరం కల్యాణలక్ష్మి, గొర్రెల పంపిణీ చెక్కులు, బీసీ కులాలకు రూ.లక్ష చెక్కులను అందించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీవాత్స కోట, డీఆర్‌డీఓ పీడీ సంపత్‌రావు, ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, జెడ్పీటీసీ రంగు కుమార్‌గౌడ్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ కిషన్, బిల్లా సుధీర్‌రెడ్డి, నర్సంహనాయక్, పూస మధు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీకి సంపూర్ణ సహకారం

● రవాణా శాఖ ఉప కమిషనర్ పురుషోత్తం


విలేజ్ బస్ ఆఫీసర్స్ మార్గదర్శకాల బుక్‌ను ఆవిష్కరిస్తున్న డీటీసీ, ఏసీపీ, ఆర్ఎం

హన్మకొండ: టీఎస్ ఆర్టీసీకి సంపూర్ణ సహకారం అందిస్తామని రవాణా శాఖ వరంగల్ డిప్యూటీ కమిషనర్ పురుషోత్తం అన్నారు. శుక్రవారం హనుమకొండ బస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విలేజ్ బస్ ఆఫీసర్స్ విధుల్లో ఏసీపీ కిరణ్ కుమార్, ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం జె.శ్రీలతతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విలేజ్ బస్ ఆఫీసర్స్ నియామకంతో సంస్థకు మేలు చేకూరుతుందన్నారు. ఏసీపీ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు కృపాకర్ రెడ్డి, మాధవరావు, డీఎంలు జి.సురేశ్, బాబు నాయక్ పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నర్సంపేట

● మంత్రి సత్యవతిరాథోడ్


మాట్లాడుతున్న మంత్రి సత్యవతిరాథోడ్

నర్సంపేట: సీఎం కేసీఆర్, మంత్రుల సహకారంతో ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నర్సంపేటను అభివృద్ధిలో అగ్రగామిగా నిలుపుతున్నారని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సంక్షేమ సంబురాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నర్సంపేట ప్రాంతం సాగునీటితో సస్యశ్యామలంగా మారిందన్నారు. నర్సంపేట అభివృద్ధిలో తనవంతు సహకారం అందిస్తానన్నారు. అనంతరం ఎమ్మెల్యే పెద్ది మాట్లాడుతూ ఇరిగేషన్ సర్క్యూట్ నర్సంపేటకు జలహారం అన్నారు. నర్సంపేట డివిజన్లో రెండు పంటలకు సరిపడా సాగునీరు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ గతంలో పది వేల మంది లబ్ధిదారులకు రూ.135కోట్లతో గొర్రెల పంపిణీ చేశామని, మిగితా వారికి త్వరలో రెండో దఫా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ రామస్వామి, ఆకుల శ్రీనివాసులు, అగ్రోస్ రాష్ట్ర బాధ్యులు రాయిడి రవీందర్‌రెడ్డి, ఏసీపీ సంపత్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రివర్స్ వస్తూ బావిలో పడిన ట్రాక్టర్..

● డ్రైవర్ దుర్మరణం
● లింగాపురం అలుముకున్న విషాదఛాయలు


కిషన్ (ఫైల్)

వెంకటాపూర్‌పేట: ట్రాక్టర్‌ను రివర్స్ తీస్తున్న క్రమంలో బావిలో పడి డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని లింగాపురంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం లింగాపురం శివారు మేఘ్యా తండాకు చెందిన అజ్మీరా కీమ (45) అదే తండాకు చెందిన అజ్మీరా శ్రీను ట్రాక్టర్‌ను తీసుకుని హార్వెస్టర్ అనే కొలు రైతుకు చెందిన చెలక దున్నడానికి శుక్రవారం తెల్లవారుజామున వెళ్లాడు. చెలక దున్నుతున్న క్రమంలో రివర్స్ తీస్తూ వ్యవసాయ బావిలో ట్రాక్టర్‌తో పడ్డాడు. దీంతో కీమ అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఎస్సై తోట మహేందర్ ఘటనా స్థలికి చేరుకుని బావి నుంచి మృతదేహాన్ని బయటికి తీయించారు.అనంతరం పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై మృతుడి భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేరుకు కౌలు.. చేసేది నకిలీ విత్తన దందా..



● పల్నాడు టు కామారెడ్డిగూడెం..
● నకిలీ విత్తనాలను పట్టుకున్న వ్యవసాయ అధికారులు
● పోలీసులకు అప్పగింత


కామారెడ్డిగూడెంలో నకిలీ పత్తి విత్తనాలను పట్టుకున్న వ్యవసాయ అధికారులు

దేవరుప్పుల: వ్యవసాయ భూములు కౌలు పేరిట వలస వచ్చిన ఆంధ్రాకు చెందిన రైతులు ఇక్కడి రైతులను నమ్మబలుకుతున్నారు. అనంతరం నకిలీ పత్తి విత్తనాలు అంటగడుతున్నారు. ఈ ఘటన శుక్రవారం కామారెడ్డిగూడెంలో వెలుగులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడుకు చెందిన రంధా పాటు రామారావు మండలంలోని కామారెడ్డిగూడెంలో వ్యవసాయ భూమి కౌలుకు తీసుకొని పత్తిసాగు చేస్తున్నాడు.ఈ క్రమంలో ఇక్కడి రైతులతో సన్నిహితం పెంచుకొని పలు పేరుమోసిన కంపెనీల నుంచి ప్యాకింగ్ అయ్యే వచ్చే విత్తనాలు అనే నని నమ్మబలికి దేవరుప్పుల, కామారెడ్డిగూడెంలో నకిలీ విత్తనాలు అమ్ముతున్నాడు. ఆంధ్రాలోని జిన్నింగ్ మిల్లుల్లో పత్తిలో తీసిన విత్తనాలను శుద్ధి చేసి ఇక్కడ రంగులద్ది కిలో రూ. చొప్పున విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందుకున్న వ్యవసాయ అధికారులు కామారెడ్డిగూడెంలో నకిలీ పత్తి విత్తనాలతో ఉన్న చందుపాటి రామారావుతోపాటు స్థానికుడు మరాఠీ యాదగిరిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ పాలకుర్తి ఏడీఏ వరుణ రామ్‌నాయక్, ఏవోభార్గవ్ ఏఈ రాజు, ఏఈఓ సాగర్, హెడ్ కానిస్టేబుల్ సదానందం తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో రైతు మృతి


లక్ష్మీనారాయణ (ఫైల్)

ఆత్మకూరు : వడదెబ్బతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం మండలంలోని పెద్దాపూర్‌లో జరిగింది. మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన గోపిరెడ్డి లక్ష్మీనారాయణ (65)కు మూడు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఈ భూమిలో మొక్కజొన్న సాగు చేస్తున్నాడు. శుక్రవారం చేనువద్దకు వెళ్లిన లక్ష్మీనారాయణ వడదెబ్బకు గురై ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు. కాగా, మృతుడి కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

కొత్తమల్లుతండాలో..


హేమ్లా(ఫైల్)

దోర్నకల్: వడదెబ్బతో మండలంలోని కొత్తమల్లుతండాకు చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. తండాకు చెందిన ధారావత్ హేమ్లా(83) శుక్రవారం మన్నేరువాగు వద్దకు మేకలను మేతకు తీసుకెళ్లాడు. మండుతున్న ఎండకు అస్వస్థతకు గురై వాగు సమీపంలోనే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన ఉండాలి

● ముల్కనూర్ సొసైటీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌రెడ్డి
● వరంగల్ ఏఆర్ఎస్‌లో రైతు సదస్సు ప్రారంభం

కరీమాబాద్: ప్రస్తుత పరిస్థితులలో రైతులు ఆధునిక వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకోవాలని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే, ముల్కనూర్ సొసైటీ అధ్యక్షుడు అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. వరంగల్ వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ఆసోచం ఆధ్వర్యంలో మూడు రోజులు జరుగనున్న టీఎస్ అగ్రిటెక్ రైతు సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి అసోచం అడిషనల్ డైరెక్టర్ దీనేశ్ అధ్యక్షత వహించగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ లాభసాటి వ్యవసాయం కోసం రైతులు మారుతున్న కాలానుగుణంగా పంటలు సాగు చేయాలన్నారు. వరంగల్ ఏఆర్ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఉమారెడ్డి మాట్లాడుతూ రైతులు పంట మార్పిడి విధానాన్ని పాటించాలన్నారు.అలాగే, సేంద్రియ వ్యవసాయంపై అవగాహన ఉండాలన్నారు. మోతాదుకు మించి పురుగుమందులు వాడొద్దని సూచించారు. కోరమండల్ జీపీ సుబ్బారెడ్డి, శాస్త్రవేత్త బలరాం, జేడీఏ ఉషాదయాళ్, డీఏవో రవీందర్ పాల్గొన్నారు.

ముగ్గురు బైక్ దొంగల అరెస్టు

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న మైనర్‌తోపాటు ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు క్రైమ్స్ ఏసీపీ దేవేందర్ తెలిపారు. వారినుంచి రూ.2.75 లక్షల విలువగల మూడు బైక్‌లు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. హసన్‌పర్తి ఉంటూర్‌కోటల్లోని దీనదయాళ్‌నగర్ చెందిన బాలుడితోపాటు విసునూటి రవీందర్ అలియాస్ బబ్లూ, అలుగు నరసింహరావులు జల్సాల కోసం దొంగతనాలు చేస్తున్నారు. బాలుడు గతంలో పద్మాక్షి దేవాలయంలో హుండీ పగులగొట్టి చోరీకి పాల్పడ్డాడు. నిందితులు హనుమకొండ, సుబేదారి పోలీస్ స్టేషన్ల పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలను చోరీ చేశారు. గత నెల 20న ములుగు జిల్లా, గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామ శివారు ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రోడ్డుపక్కన పడేసిన బైక్‌ను అపహరించారు. వీరిని శుక్రవారం హంటర్‌రోడ్డులోని రాజ్ హోటల్ పరిసరాల్లో అరెస్టుచేసినట్లు తెలిపారు.